
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

సోమవారం । 4 । నవంబర్ । 2024



70.388 టీఎంసీలకు సోమశిల

సోమశిల: జలాశయంలో ఆదివారానికి 70.388 టీఎంసీలు ఉన్నాయి. ఎగువ నుంచి 18,600 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, డెల్టాకు 2,100, కండలేరుకు 10 వేలు, ఉత్తరకాలువకు 700, దక్షిణకాలువకు 5 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.80,820
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.7,370
3 శాతం జీఎస్టీతో	రూ.7,591
సవర (8గ్రా)	రూ.60,728

గరిష్టం/కనిష్టం
33.2 /27.0

వాతావరణం

జిల్లాలో సోమవారం వాతావరణం పొడిగా ఉంటుంది. అక్కడక్కడ ఆకాశం పాక్షికంగా మేఘావృతంగా ఉండే అవకాశం. ఆదివారం గాలిలో తేమ 73 శాతం ఉంది.

న్యూస్‌రీల్

సంస్థ అభివృద్ధికి కృషి చేయాలి

- ఆర్టీసీ నెల్లూరు జోన్ ఈడీ గిడుగు వెంకటేశ్వరరావు



ఉత్తమ సేవలందించిన ఆర్టీసీ సిబ్బందికి ప్రశంసా పత్రాలు

కందుకూరు: ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు, సంస్థ ఆదాయాన్ని పెంచి అభివృద్ధికి కృషి చేయాలని ఆర్టీసీ నెల్లూరు జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిడుగు వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన కందుకూరు ఆర్టీసీ డిపోను సందర్శించారు. కార్తీక మాసం సందర్భంగా ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక యాత్ర స్పెషల్ బస్సుల ప్రచార వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్తీక మాసంలో పంచారామాలు, అరుణాచలం, శబరిమల క్షేత్రాలకు ప్రత్యేక బస్సులను కందుకూరు డిపో నుంచి నడుపుతున్నట్లు తెలిపారు. కందుకూరు డిపో కేఎంపీఎల్, ఈపీకేలో జోన్‌లోనే మంచి ఫలితాలు సాధిస్తుందన్నారు. అధికారులు, సిబ్బంది పరస్పర సహకారం వల్లే ఇది సాధ్యమవుతుందన్నారు. ఈ సందర్భంగా డ్రైవర్స్ సంతోష వారోత్సవాల్లో భాగంగా వారితో ప్రత్యేకంగా ముచ్చటించి డ్రైవర్, కండక్టర్లకు పలు సూచనలు చేశారు. స్పెషల్ ఆపరేషన్స్‌లో కందుకూరు డిపో ముందుందని, ప్రయాణికుల సౌకర్యార్థం సర్వీసులు పెంచే వెసులుబాటును పరిశీలిస్తామని చెప్పారు. ప్రధానంగా కందుకూరు నుంచి జిల్లా కేంద్రమైన నెల్లూరుకు సర్వీసులను పెంచడంతో పాటు, వైజాగ్ సర్వీస్, సింగరాయకొండ రైల్వేస్టేషన్ నుంచి కందుకూరుకు రాత్రి సర్వీసులు నడిపే ప్రతిపాదనను కూడా ఉన్నతాధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. అనంతరం ఉత్తమ సేవలు అందించిన కండక్టర్లు, డ్రైవర్లు, మెకానిక్‌లకు ప్రశంసా పత్రాలు, నగదు బహుమతులు అందజేశారు. డిపో ఆవరణలో మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. డిపో మేనేజర్ శ్రీనివాసులు, అసిస్టెంట్ మేనేజర్ ప్రసాద్ పాల్గొన్నారు.

రూ.25 వేలు కట్టు.. బెల్ట్ దుకాణం పట్టు

కోవూరు(కొడవలూరు): కూటమి ప్రభుత్వంలో తెలుగు తమ్ముళ్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. నియోజకవర్గంలో అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారు. పేకాట స్థావరాలు ఒకవైపు.. మద్యం సిండికేట్లు మరోవైపు యథేచ్ఛగా నడిపిస్తున్నారు. రూ.25 వేలు కడితే మీ ఇష్టారాజ్యంగా మద్యం బెలు దుకాణాలు నడుపుకోవచ్చు. అధికారులెవరూ మీ వద్దకు రారంటూ ఆఫర్లు ఇస్తున్న వైనం కొడవలూరు మండలంలో వెలుగు చూసింది. అధికార పార్టీ నేతలు సిండికేటుగా మారి బహిరంగంగా సమావేశం ఏర్పాటు చేసి బెల్ట్ దుకాణదారులను పిలిచి సెటిల్మెంట్ చేసుకున్నారు. అధికారులు కొడవలూరు మండలం వైపు కన్నెత్తి చూడరని.. చూసినా వారి సంగతి పైస్థాయిలో మేము చూసుకుంటామని చెప్పారు. దీంతో బెల్టుదుకాణాల నిర్వాహకులు ధైర్యంగా ప్రతి గ్రామంలో కనీసం పదికి తగ్గకుండా బెల్టు షాపులు తెరిచి మద్యం అమ్మకాలు సాగిస్తున్నారు. తాగునీరు దొరకని కాలనీలున్నాయి. కానీ కొడవలూరు మండలంలో బెల్టు దుకాణాలు లేని కాలనీలు లేవంటే అతిశయోక్తి కాదు.

వివాహిత బలవన్మరణం



తేజస్విక మృతదేహం

నెల్లూరు సిటీ: భర్త వేధింపులు తాళలేక ఓ వివాహిత బలవన్మరణానికి పాల్పడిన ఘటన ఆదివారం జరిగింది. మండలంలోని వేమారెడ్డినగర్‌లోని రాగాల యాచేంద్ర, తేజస్విక (20) దంపతులు నివాసం ఉంటున్నారు. వీరికి వివాహమై రెండేళ్లు గడిచినా పిల్లలు లేకపోవడంతో భర్త యాచేంద్ర నిత్యం తేజస్వికని వేధిస్తున్నాడు. దీంతో ఆమె బలవన్మరణానికి పాల్పడింది. నెల్లూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అవినీతి రాజా.. టెండర్ల డ్రామా

సర్వేపల్లి నియోజకవర్గంలో 'అవినీతి' కొత్త పుంతలు తొక్కుతోంది. నీటి పారుదల శాఖలో పారదర్శకమైన టెండర్ల ప్రక్రియను ఫార్స్‌గా మార్చేశారు. బిడ్ల ఖరారుకు ముందే పనులు చేయడం చూస్తే.. టెండర్లు ఎవరు వేసినా.. పనులు మాత్రం మేమే చేస్తామనే సందేశాన్ని ఇస్తున్నారు. టెండర్ల ప్రక్రియ అంతా డ్రామా అని స్పష్టమవుతోంది. షాడో ఎమ్మెల్యే కనుసన్నల్లో తమ్ముళ్లు జేబులు నింపుకునేందుకు యంత్రాలతో తూతూ మంత్రంగా పనులు చేయిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా బరితెగించి అధికార పార్టీ నేతలు మేత కోసం చేస్తున్న ఈ పనులకు ఇరిగేషన్ అధికారులు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడం వెనుక భారీగానే ముడుపులు అందాయన్న ఆరోపణలున్నాయి. ఆయా పనులపై న్యాయపోరాటం చేస్తామని ప్రతిపక్ష పార్టీ నేతలు హెచ్చరిస్తున్నారు.



కనుపూరు కాలువలో యంత్రాలు పెట్టి పూడిక తొలగింపు పనులు చేస్తున్న దృశ్యం

- వెంకటాచలం మండలంలో పూడికతీత పనులకు టెండర్ల ఆహ్వానం
- రూ.6 కోట్లతో అంచనాలు రూపొందించిన ఇరిగేషన్ అధికారులు
- టెండర్లు ఎవరూ దాఖలు చేయొద్దని ఇప్పటికే ఆదేశాలు
- ఈ నెల 11 వరకు బిడ్ల దాఖలుకు గడువు ఇచ్చిన అధికారులు
- ఈ ప్రక్రియకు ముందే షాడో ఎమ్మెల్యే ఆదేశాలతో మొదలైన పనులు
- షాడో ఎమ్మెల్యే కనుసన్నల్లో తూతూ మంత్రంగా పనులు
- విజిలెన్స్ విచారణకు డిమాండ్ చేస్తున్న ప్రతిపక్ష పార్టీ నేతలు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: సర్వేపల్లి నీటి పారుదలశాఖలో షాడో ఎమ్మెల్యే కనుసన్నల్లో అవినీతి ప్రవాహం కొనసాగుతోంది. నియోజకవర్గంలో పలు కాలువల్లో పూడిక తీతకు సంబంధిత ఇరిగేషన్‌శాఖ రూ.6 కోట్ల అంచనాలతో 23 పనులకు గత నెల 28న టెండర్లను ఆహ్వానించింది. ఈ నెల 11వ తేదీ వరకు బిడ్స్ దాఖలు చేసేందుకు గడువిచ్చారు. అయితే అంతకు ముందే ఆయా పనులను షాడో ఎమ్మెల్యే కనుసన్నల్లో తమ్ముళ్లు ప్రారంభించేశారు. టీడీపీ నేతల బరితెగింపునకు ఇరిగేషన్ అధికారులు సైతం తోడ్పాటు అందించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇరిగేషన్ సెంట్రల్ డివిజన్ పరిధిలో ఉన్న వెంకటాచలం మండలంలోని తిక్కవరపుపాడు బ్రాంచ్ కెనాల్, కనుపూరు మెయిన్ కెనాల్, ముద్దమూడి బ్రాంచ్ కెనాల్, కాకుటూరు కొత్త ట్యాంక్ సప్లయ్ చానల్, సూరేపల్లి వాగు కెనాల్, చవిటిమడుగు, గొల్లమూడి అనకేపల్లి మైనర్ డ్రెయిన్, పూడిపర్తి మెయిన్ డ్రెయిన్, గురివిందపాడు బ్రాంచ్ కెనాల్, శ్రీరామపురం ట్యాంక్, కొమ్మలపూడి, సింగారెడ్డి మెయిన్ డ్రెయిన్‌లో పూడికతీత పనులు చేపట్టేందుకు ఈ టెండర్లు ఆహ్వానించారు.

సోమిరెడ్డి అవినీతికి పరాకాష్ట

- టెండర్లు పూర్తి కాకుండానే పనులెలా చేస్తారు?
- కుమారుడికి పనులు కట్టబెట్టి నిధుల దోపిడీ
- మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు: సోమిరెడ్డి అవినీతి పరాకాష్టకు చేరిందని, ఆయన అబద్ధాల పుట్టని సర్వేపల్లి నియోజకవర్గంలో టెండర్ల ప్రక్రియ పూర్తి కాకుండానే ఇరిగేషన్‌శాఖ పనులను తన కుమారుడికి అప్పగించి నిధులు దోచుకుంటున్నాడని వైఎస్సార్‌సీపీ ఉమ్మడి నెల్లూరు జిల్లా అధ్యక్షుడు, మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం కాకాణి విలేకరులతో మాట్లాడుతూ సోమిరెడ్డి, ఆయన తనయుడు ఇరిగేషన్‌శాఖలో తూతూ మాత్రంగా పనులు చేసి రూ.6 కోట్లు దోచుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. కాలువల పనులకు సంబంధించి గత నెల 28 టెండర్లు పిలిచారని, ఈ నెల 11వ తేదీ వరకు టెండర్లు దాఖలు చేసేందుకు సమయం ఉందన్నారు. అయితే సోమిరెడ్డి టెండర్లతో పనిలేకుండా పనులు మొదలు పెట్టారని విమర్శించారు. ఆయా పనులను సైతం తూతూ మంత్రంగా చేపడుతున్నారన్నారు. కాలువ గట్టులకు పక్కన ఉన్న మట్టినే ఎత్తి చదును చేస్తూ బయట నుంచి మట్టి తోలామని దోచుకుంటున్నట్టు పేర్కొన్నారు. తమ ప్రభుత్వంలో భారీ వర్షాలు కురిసి వరదలు వచ్చి కాలువకు గండ్లు పడితే రిపేర్లు చేపట్టామన్నారు. టెండర్లు పిలవకుండా పనులు ఎలా చేస్తారని ప్రశ్నించిన సోమిరెడ్డి ఇప్పుడెలా పనులు చేస్తాడని నిలదీశారు. రైతుల భాగస్వామ్యంతో పనులు చేస్తున్నట్టు ప్రకటించిన ఆయన్ను రైతులే తప్పుపడుతున్నట్టు పేర్కొన్నారు. టీడీపీకి చెందిన వారిని లోబర్చుకుని రైతుల ముసుగులో పనులు చేస్తున్నట్టు రైతులే మండిపడుతున్నారు. కాలువల్లో పూడిక పనులను కూలీలతో చేయించాల్సి ఉండగా యంత్రాలు పెట్టి పనులు చేస్తున్నా.. ఇరిగేషన్ అధికారులు పట్టీపట్టనట్టు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రైతులను అడ్డు పెట్టుకుని దోచుకునే సోమిరెడ్డికి రైతుల సంక్షేమం పట్టదని, వారి గురించి మాట్లాడే హక్కు లేదన్నారు. సర్వేపల్లి ఇరిగేషన్ శాఖలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై కలెక్టర్‌కు ఆధారాలతో సహా ఫిర్యాదు చేస్తామని స్పష్టం చేశారు.



టెండర్లు ఎవరూ వేయకూడదని..

అయితే పూడికతీత పనుల పేరుతో నిధులు ఆరగించేందుకు షాడో ఎమ్మెల్యే ఓ పథకం ప్రకారం పనులు ప్రారంభించారు. టెండర్ల ప్రక్రియలో విధివిధానాలు ఉంటాయి. రైతుల సాగునీటి అవసరాలకు అత్యవసరమైన పనులను గుర్తించి ఆయా పనులకు అంచనాలు రూపొందించి టెండర్లకు ఆహ్వానించారు. అయితే ఆయా పనులకు ఎవరూ టెండర్లు దాఖలు చేయడానికి వీల్లేదని ఇప్పటికే టీడీపీ నేతలు స్థానికంగా హెచ్చరికలు జారీ చేశారు. ఇదే సమయంలో ఆయా పనులను ఇరిగేషన్ అధికారుల సహకారంతో ముందునే చేపడుతున్నారు. ఇక పనులు మొదలైతే టెండర్లు దాఖలు చేసేందుకు ఎవరూ ముందుకు రాకుండా ఉంటారనే ఉద్దేశంతో నయా వ్యూహంతో పారదర్శకమైన టెండర్ల ప్రక్రియను అభాసుపాలు చేశారు. షాడో ఎమ్మెల్యే కనుసన్నల్లో తమ్ముళ్లు మాత్రమే టెండర్లు వేసుకునేందుకే ఈ వ్యవహారం నడిపిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. సర్వేపల్లి నియోజకవర్గంలో పూడిక తీత పనుల పేరుతో నిధులు ఆరగించేందుకు అత్యవసర పనులంటూ రూ.25 కోట్ల వరకు అంచనాలు రూపొందించారు. ఇందులో తక్షణంగా అత్యవసరమైన పనుల పేరుతో తొలి దఫాగా రూ.6 కోట్ల విలువైన పనులకు టెండర్లు ఆహ్వానించడం గమనార్హం. మిగిలిన పనులకు కూడా ఇదే తరహాలో త్వరలోనే టెండర్లను ఆహ్వానించే అవకాశం ఉంది. తాజాగా జరుగుతున్న ఇరిగేషన్ పనులపై ప్రతిపక్షాలు న్యాయ పోరాటానికి సిద్ధమవుతున్నాయి. ఇదే జరిగితే ఇరిగేషన్ శాఖ అధికారులు దోషులుగా బోనులో నిలబడే పరిస్థితి అనివార్యమవుతోంది.

అప్పుడిలా.. ఇప్పుడిలా..

గత ప్రభుత్వ హయాంలో భారీ వర్షాలతో వరదలు వచ్చి కాలువలకు గండ్లు ఏర్పడ్డాయి. అప్పట్లో పంటలు సాగుచేసి ఉండడంతో ఆ పంటలను రక్షించుకునేందుకు తాత్కాలిక మరమ్మతుల కోసం టెండర్లతో కాకుండా నామినేషన్‌పై యుద్ధ ప్రాతిపదికన పనులు చేయించారు. ఆ విధానాన్ని తప్పు పట్టిన ప్రస్తుత ఎమ్మెల్యే ఆయా పనులపై విజిలెన్స్ విచారణకు ఆదేశించారు. అయితే సదరు ఎమ్మెల్యే సర్వేపల్లిలో టెండర్ల ప్రక్రియను అభాసుపాలు చేస్తూ పనులు ప్రారంభించి దోపిడీ చేయడంపై స్థానిక ప్రజలే ముక్కున వేలుసుకుంటున్నారు.

అమాత్యుల్లారా.. అంత తొందరా!

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలిసారిగా జరిగిన జిల్లా సమీక్ష మండలి సమావేశం (డీఆర్‌సీ) అర్ధాంతరంగా ముగిసింది. జిల్లా ప్రజల అవసరాలు, అభివృద్ధిపై కనీసం సమీక్షించకుండానే ఒకటి.. రెండు శాఖలపై మొక్కుబడిగా అధికారులతో మాట్లాడి మమ అనిపించారు. రాజకీయ విమర్శలు, టీడీపీ గొప్పల గప్పాలకే ప్రాధాన్యతమిచ్చారు. సమావేశానికి ఆలస్యంగా వచ్చిన మంత్రులు.. హడావుడిగా సమీక్ష ముగించి గంటన్నరలోనే తిరిగి వెళ్లిపోయారు. ఎన్నికల ముందు ఎన్నెన్నో హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చాక.. ఆ హామీలన్నింటిని తుంగలో తొక్కింది. కూటమి ప్రభుత్వంలో ప్రజలు ఎన్నో సమస్యలతో సతమతమవుతున్నారు. ఆయా సమస్యలపై చర్చించే తీరిక అమాత్యులకు లేకుండా పోయింది.

- అర్ధాంతరంగా ముగిసిన డీఆర్సీ సమావేశం
- ఒకట్రెండు శాఖలకే పరిమితమైన సమీక్ష
- రాజకీయ విమర్శలకే ప్రాధాన్యత

నెల్లూరు (పొగతోట): జిల్లా సమీక్ష మండలి సమావేశం మొక్కుబడిగా జరిగింది. ప్రజల సమస్యలపై చర్చించే తీరిక లేదన్నట్లుగా జిల్లా ఇన్‌చార్జి మంత్రితో పాటు జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులు హడావుడిగా సమీక్షను ముగించి వెళ్లిపోవడంపై అధికార వర్గాల్లో చర్చనీయాంశం అయింది. ఆదివారం జెడ్పీ సమావేశ మందిరంలో తొలిసారిగా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎన్ఎండీ ఫరూఖ్, మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణ నేతృత్వంలో డీఆర్‌సీ సమావేశం జరిగింది. గడిచిన మూడు నెలలుగా అనేక పర్యాయాలు వాయిదా పడుతూ వచ్చిన ఈ సమావేశం ఎట్టకేలకు ఆదివారం మధ్యాహ్నం 2.30 గంటలకు ప్రారంభమవుతుందని ప్రకటించారు. సుమారు 17 శాఖలపై సమీక్షించేలా అజెండా రూపొందించారు.

ప్రజాసమస్యలపై చర్చించే సమయం లేదా?



డీఆర్‌సీ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రులు ఫరూఖ్, నారాయణ, ఆనం, జెడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ

గంటన్నరలోనే ముగింపు

డీఆర్‌సీ సమావేశానికి మంత్రులు రావడం ఆలస్యం కావడంతో అరగంట ఆలస్యంగా సమావేశం ప్రారంభమైంది. డీఆర్సీ సమావేశం సుదీర్ఘంగా జరగాల్సి ఉంది. గతంలో డీఆర్సీ నిర్వహణకు నాలుగు నుంచి ఐదు గంటల సమయం కేటాయించేవారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మొట్టమొదటిసారిగా నిర్వహించిన డీఆర్సీ సమావేశం పూర్తి స్థాయిలో జరగకుండానే సమయం లేదంటూ అర్ధాంతరంగా ముగించారు. కేవలం గంటన్నరలోపే పూర్తయిందనిపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చాక ఎన్నో సమస్యలు ఉత్పన్నమయ్యాయి. జిల్లాలో ప్రధానంగా ఇసుక కొరత వేధిస్తోంది. మరో వైపు రబీ సీజన్ ప్రారంభమైనా ఇంత వరకు ఐఏబీ సమావేశం నిర్వహించి నీటి విడుదల షెడ్యూల్ ప్రకటించలేదు. మరో వైపు కాలువల్లో గుర్రపు డెక్క, గడ్డి, నాచు, జమ్ముతో పూడిపోయి ఉన్నాయి. ఇవే కాకుండా వివిధ సంక్షేమ పథకాలు నిలిచిపోయాయి. ఆయా సమస్యలతో పాటు జిల్లాలో అభివృద్ధికి సంబంధించి శాఖల వారీగా నివేదికలు ఉన్నా.. సమీక్షించేందుకు అమాత్యులు ఇష్టపడలేదని తెలుస్తోంది. టీడీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం, అసమర్థత, వైఫల్యాలు కావడంతో ఒకటి.. రెండు శాఖలపై మొక్కుబడిగా చర్చను మమ అనిపించారు.

సోమిరెడ్డికి ఇన్‌చార్జి మంత్రి చురకలు

సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వివిధ శాఖల సమీక్షలో 2014–19 మధ్య టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎన్ని పనులు జరిగాయి. 2019–24 వరకు వైఎస్సార్‌సీపీ పాలనలో ఎన్ని పనులు జరిగాయంటూ అధికారులను ప్రశ్నించడం ప్రారంభించారు. దీంతో ఇన్‌చార్జి మంత్రి స్పందిస్తూ మీరు సీనియర్ మంత్రిగా పనిచేశారు. ప్రజాప్రతినిధిగా ఉండి ఈ విధంగా ప్రశ్నించడం సబబు కాదంటూ చురకలు అంటించారు.

పనులపై సమాచారం ఇవ్వండి: మంత్రి ఆనం

మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ ఎంపీ వేమిరెడ్డికి జరిగిన విషయంలో క్షమించాలని కోరారు. పనుల నిర్వహణకు సంబంధించి అధికారులు పూర్తి సమాచారం తెలియజేయాలన్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలో పరిశ్రమల ఏర్పాటుకు సేకరించిన భూముల విషయంలో కలెక్టర్ ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. భూములు స్వాధీనం చేసుకొని పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. నగరంలో వివిధ సమస్యలను అధికారులు పరిష్కరించాలన్నారు.

నిధులు లేకపోతే సమయం ఎందుకు వృథా చేస్తావు

డీఆర్‌సీ సమావేశంలో ఇరిగేషన్, డ్వామా, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ శాఖలపై సమీక్షించడంతో సమయం లేదంటూ ఇన్‌చార్జి మంత్రి సమావేశాన్ని అర్ధాంతరంగా ముగించారు. ఆయా నియోజకవర్గాల సమస్యలపై చర్చించేందుకు ఎమ్మెల్యేలు సిద్ధంగా ఉన్నా.. వారి కోరిక మేరకే సమావేశాన్ని ముగిస్తున్నామంటూ ప్రకటించడంపై అధికారులతో పాటు ఎమ్మెల్యేలు నివ్వెరపోయారు. ప్రజల సమస్యలు, జిల్లా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు, తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించాల్సి ఉన్నా.. మొదటి సమావేశాన్ని పూర్తిస్థాయిలో సమీక్షించకుండా మమ అనిపించారు. అధికారులతో సమీక్షలో పంచాయతీరాజ్ ఎస్ఈ అశోక్‌కుమార్ వివరణ ఇస్తుండగా పనుల నిర్వహణకు నిధులు ఉన్నాయా? లేవా? అంటూ ఇన్‌చార్జి మంత్రి ప్రశ్నించారు. నిధులు లేకపోతే సమయం ఎందుకు వృథా చేస్తావు.. సభ్యులు అడిగిన వాటికి సమాధానం చెప్పాలంటూ అసహనం వ్యక్తం చేశారు.

జిల్లాలో పరిశ్రమల అవసరం : కలెక్టర్

కలెక్టర్ ఓ.ఆనంద్ మాట్లాడుతూ జిల్లాలో 9 తీర ప్రాంత మండలాలు ఉన్నాయి, 2011 జనాభా లెక్కల ప్రకారం 25 లక్షల మంది ఉండగా అందులో 21 శాతం ఎస్సీ జనాభా ఉందన్నారు. జిల్లాలో 25 శాతం చదువుకున్న వారున్నారన్నారు. సోమశిల, కండలేరులో నీరు అందుబాటులో ఉందని తెలిపారు. కృష్ణపట్నం పోర్టు, రామాయపటం పోర్టు వల్ల పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. పాత జిల్లాలో అధిక శాతం పరిశ్రమలు ఉన్నాయని, అవి ప్రస్తుతం తిరుపతి జిల్లాకు వెళ్లిపోయాయని తెలిపారు.

జాతీయ రహదారి పై ఫ్లైఓవర్స్ నిర్మించాలి: ఎమ్మెల్సీ పర్వతరెడ్డి

ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ నగరంలో మెడికవర్ హాస్పిటల్, కనుపర్తిపాడు జాతీయ రహదారిపై నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రమాదాల నివారణకు ఆయా ప్రాంతాలలో ఫ్లై ఓవర్ బ్రిడ్జిలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వైఎస్సార్‌సీపీ హయాంలో నగరంలో ఫ్లై ఓవర్ బ్రిడ్జి ఏర్పాటు జరిగిందన్నారు. ఫ్లై ఓవర్ ఏర్పాటు చేసిన ప్రాంతంలో ట్రాఫిక్ సిగ్నల్స్ లేని కారణంగా అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేసి ఫ్లై ఓవర్ కింద సుందరీకరణ పనులు చేపట్టాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, ఎమ్మెల్సీలు తూమాటి మాధవరావు, కళ్యాణ్ చక్రవర్తి, కందుకూరు, కావలి, కోవూరు, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యేలు ఇంటూరు నాగేశ్వరరావు, దగుమాటి కృష్ణారెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, జేసీ కార్తీక్, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.





డీఆర్‌సీ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్సీలు పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి, తూమాటి మాధవరావు, బల్లి కళ్యాణ్ చక్రవర్తి

ఆత్మకూరులో తమ్ముళ్ల అరాచకం

ఆత్మకూరు నియోజకవర్గంలో అధికార పార్టీ నేతల అరాచకాలకు అంతుపంతూ లేకుండా పోతోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా కక్షపూరిత రాజకీయాలను ప్రోత్సస్తున్నాయి. వైఎస్సార్‌సీపీ నేతలను టార్గెట్ చేస్తూ పోలీసుల ద్వారా అక్రమ కేసులు బనాయిస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. అనంతసాగరం మండలంలోని శంకరనగరంలో వైఎస్సార్‌సీపీ నేతలపై అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపి, రౌడీషీట్లు ఓపెన్ చేయించిన నేతలు తాజాగా అదే మండలంలోని పంచాయతీరాజ్ గెస్ట్‌హౌస్‌కు దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి పేరు బోర్డును తొలగించేశారు. నేతల అక్రమాలను ప్రశ్నిస్తే కేసులు నమోదు చేయిస్తున్నారు. కొందరు పోలీసులు అధికార పార్టీ నేతల మెప్పు కోసం అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు.


- దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి గౌరవానికి భంగం
- కొద్ది నెలల క్రితం సంగం బ్యారేజీపై పేరు తొలగింపు
- తాజాగా అనంతసాగరంలోని విశ్రాంతి గృహానికి..
- మండల, జెడ్పీ తీర్మానంతో గెస్ట్‌హౌస్‌కు గౌతమ్‌రెడ్డి పేరు ఏర్పాటు
- మంత్రి మెప్పు కోసం తమ్ముళ్ల ఓవర్ యాక్షన్
- చేజర్లలో పోలీసుల పక్షపాత వైఖరి

సాక్షి, టాస్క్‌ఫోర్స్: దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి ఆత్మకూరు నియోజకవర్గంలో వరుసగా రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచి ఆ ప్రాంత అభివృద్ధికి తనవంతు కృషి చేశారు. ఎక్కడా అవినీతి మరకలు అంటకుండా ప్రజా సేవలో ఉంటూ చిన్న వయస్సులోనే అకాల మరణం చెందడంతో ఆత్మకూరు ప్రజలు దివంగత నేతను మరవలేకున్నారు. ఆయన సేవలకు గుర్తుగా సంగం బ్యారేజీకి, అనంతసాగరం మండలంలోని పంచాయతీరాజ్ శాఖ గెస్ట్‌హౌస్‌కు ఆయన పేరును చట్ట సభల సాక్షిగా నామకరణం చేశారు. ఆయన గౌరవార్థం ఏర్పాటు చేసిన బోర్డులను తొలగించి, ఆయన పేరును అగౌరవ పరుస్తున్నారు. ఇప్పటికే సంగం బ్యారేజీకి ఉన్న గౌతమ్‌రెడ్డి పేరును తొలగించారు. తాజాగా పంచాయతీరాజ్ గెస్ట్‌హౌస్‌పై ఉన్న పేరును తొలగించారు. గత ప్రభుత్వ హయాంలో ఈ గెస్ట్‌హౌస్ నిర్మాణం పూర్తి చేశారు. జిల్లా పరిషత్, మండల పరిషత్ సమావేశాల్లో తీర్మానం చేసి గెస్ట్‌హౌస్‌కు గౌతమ్‌రెడ్డి పేరును నామకరణం చేశారు. అయితే ఇటీవల మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అనంతసాగరం మండలంలో జరిపిన ప్రజావిజ్ఞప్తుల కార్యక్రమం సందర్భంగా ఆయన మెప్పు కోసం టీడీపీ మూకలు గౌతమ్‌రెడ్డి పేరుతో ఉన్న గెస్ట్‌హౌస్ బోర్డును తొలగించడంతో పాటు శిలాఫలకంలో ఉన్న పేరుపై స్టిక్కర్ అంటించారు. ప్రజాహృదయాల్లో ఉన్న గౌతమ్‌రెడ్డి పేరును తొలగింపుపై వైఎస్సార్‌సీపీ శ్రేణులు, మేకపాటి అభిమానులు మండిపడుతున్నారు. టీడీపీ నేతల అరాచకాలపై ప్రజాగ్రహం పెల్లుబికుతోంది.

చేజర్లలో పోలీస్ అరాచకం

చేజర్లలో పోలీస్ అరాచక రాజ్యం నడుస్తోందని వైఎస్సార్‌సీపీ నేతలు మండి పడుతున్నారు. ఇటీవల దీపావళి పండగ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నేతలు ఏర్పాటు చేసుకున్న ఫ్లెక్సీలను పంచాయతీరాజ్‌శాఖ అధికారులు, పోలీసులు పర్యవేక్షణలోనే తొలగించారు. అక్కడి టీడీపీ అక్రమాలను ప్రశ్నించారని ఇద్దరు వైఎస్సార్‌సీపీ నేతలపై అక్రమ కేసులు బనాయించారు. సీఐ స్థాయి అధికారే స్వయంగా ప్రతి విషయంలో తలదూర్చుతూ ప్రతిపక్షాన్ని టార్గెట్ చేస్తూ అక్రమ కేసులు బనాయించేలా చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

- చేజర్ల మండలం ఆదూరుపల్లిలో వైఎస్సార్‌సీపీ అభిమానులు టపాసులు విక్రయాల కోసం అనుమతులు తెచ్చుకున్నారు. ఆత్మకూరు ఆర్డీఓ అనుమతులు మంజూరు చేశారు. కానీ అధికార పార్టీ నేతలు ప్రతిపక్ష పార్టీ అభిమానులు వ్యాపారాలు జరగకుండా చూడాలని ఆదేశించడంతో స్థానిక ఎమ్మార్వో, సీఐ స్థాయి అధికారులే స్వయంగా రంగంలోకి దిగారు. వైఎస్సార్‌సీపీ అభిమానులకు సంబంధించిన మూడు దుకాణాలను ప్రారంభించకుండా పోలీసులను కాపలా ఉంచారు. దీంతో ఆయా వ్యాపారులు రూ.లక్షల్లో నష్టపోవాల్సి వచ్చింది. టీడీపీ అభిమానులకు సంబంధించిన బాణసంచా దుకాణాలను తెరిపించి పోలీసులు దగ్గరుండి వ్యాపారం చేయించడం కొసమెరుపు. పోలీసులు తమ విధినిర్వహణను మరిచి అధికార పార్టీ నేతల మెప్పు కోసం చేస్తున్న అత్యుత్సాహంపై ప్రతిపక్ష పార్టీ భగ్గుమంటుంది. ప్రభుత్వం మారితే ఆ పోలీసుల పరిస్థితి ఏమిటో తెలుసుకోవాలని స్థానిక ప్రజలు హితవు పలుకుతున్నారు.



తొలగించిన నేమ్‌బోర్డును చూపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు (ఫైల్)

క్లుప్తంగా

నేను కాదు.. నువ్వే అవినీతిపరుడివి

- కరేడు టీడీపీలో రచ్చ
- సోషల్ మీడియాలో పోస్టులు పెట్టుకుంటున్న టీడీపీ నేతలు
- అవినీతి వెలుగులోకి రావడంతో అవాక్కవుతున్న జనం

ఉలవపాడు: మండలంలోని కరేడులో ఇద్దరు టీడీపీ నేతల వ్యవహారం రచ్చకెక్కింది. గ్రామంలో పెత్తనం చేస్తున్న ఇద్దరు నాయకుల మధ్య సోషల్ మీడియా వేదికగా యుద్ధం నడుస్తోంది. వారంరోజులుగా ఒకరిపై ఒకరు అవినీతి ఆరోపణలు చేసుకుంటున్నారు. దీంతో అవినీతి, అక్రమాల్లో ఇద్దరూ ఆరి తేరారని గ్రామస్తులు అంటున్నారు.

ఉద్యోగాల పేరుతో దండుకున్నావ్..


గ్రామానికి చెందిన చెంచురామిరెడ్డి ఉద్యోగాల పేరుతో దందా చేస్తున్నాడని, గురుకుల పాఠశాల, పంచాయతీల్లో ఒప్పంద ఉద్యోగాలు ఇప్పిస్తానని అనేకమంది నుంచి నగదు వసూలు చేస్తున్నాడని, పంచాయతీలో పనిచేసే కార్మికులను తన ఇంట్లో పనిచేయించుకున్నాడని శ్రీనివాసులు అనే నేత సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. దీనికి కౌంటర్‌గా చెంచురామిరెడ్డి శ్రీనివాసులు చేస్తున్న అక్రమాలను సోషల్ మీడియాలో పెట్టాడు. ఇలా ఇద్దరి మధ్య వివాదం మొదలైంది. శ్రీనివాసులు సైతం కౌంటర్ ఇచ్చాడు. రేషన్ బియ్యం వ్యాపారం ద్వారా నెలకు రూ.60,000, చెరువులో మట్టి తరలింపు, ఫారెస్ట్‌లో ఒక్కో ఇసుక బండి నుంచి రూ.200 చొప్పున వసూలు, యానిమేటర్లుగా పెట్టిస్తానని రూ.లక్ష చొప్పున వసూలు చేశాడని చెంచురామిరెడ్డిపై బహిరంగంగానే విమర్శలు చేశాడు. కూటమి ప్రభుత్వంలో టీడీపీ నేతలు ఏ విధంగా అక్రమాలకు పాల్పడుతున్నారో బయటపెట్టడంతో ప్రజలు అవాక్కవుతున్నారు.

ఫిక్స్ చేసి వసూలు

కరేడు గ్రామ పరిధిలో ఈ ఇద్దరు టీడీపీ నాయకుల తీరును చూసి ప్రజలు నవ్వుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అవినీతి, అక్రమాలు పెరిగిపోయాయి. ప్రతి పనికి ఇంత రేటును ఫిక్స్ చేసి వసూలు చేస్తున్నారు. ఇప్పుడు కరేడులో ఇద్దరు నేతల ఆధిపత్య పోరుతో సదరు దోపిడీ వ్యవహారాన్ని బహిరంగం చేశారని కార్యకర్తలు తలలు పట్టుకుంటున్నారు.

జిల్లా వ్యాప్తంగా నాకాబందీ

- ఓపెన్ డ్రింకింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్‌పై 93 కేసులు



హైవేపై వాహన తనిఖీలు చేస్తున్న మనుబోలు పోలీసులు

నెల్లూరు(క్రైమ్): ఎస్పీ జి.కృష్ణకాంత్ ఆదేశాల మేరకు నేరనియంత్రణ, శాంతిభద్రత పరిరక్షణ చర్యల్లో భాగంగా శనివారం అర్ధరాత్రి జిల్లా వ్యాప్తంగా పోలీస్ అధికారులు నాకాబందీ నిర్వహించారు. ప్రధాన కూడళ్లు, జాతీయ రహదారి ప్రవేశం, నిష్క్రమణ ప్రాంతాల్లో విస్తృతంగా వాహన తనిఖీలు చేపట్టారు. మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్న 36 మందిపై కేసులు నమోదు చేశారు. నిబంధనలు ఉల్లంఘించి వాహనాలు నడుపుతున్న వారిపై 263 కేసులు నమోదు చేసి రూ.1,19,660లు జరిమానా విధించారు. బహిరంగ మద్య సేవనంపై కొరడా ఝుళిపించారు. పలు ప్రాంతాల్లో 57 మందిపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు మాట్లాడుతూ ఎస్పీ ఆదేశాల మేరకు శనివారం రాత్రి 11 గంటల నుంచి రెండుగంటలపాటు నాకాబందీ చేపట్టామన్నారు. ఇకపై రోజూ నిర్వహిస్తామని చెప్పారు. ట్రిపుల్ రైడింగ్, మద్యం మత్తులో, రాంగ్ రూట్‌లో వాహనాలు నడపడం ప్రమాదకరమన్నారు. వాహనచోదకులు నిబంధనలు పాటిస్తూ గమ్యస్థానాలకు సురక్షితంగా చేరుకోవాలని సూచించారు. ద్విచక్ర వాహనచోదకులు విధిగా హెల్మెట్, కార్లు, ఇతర వాహనాలు నడిపేవారు సీట్ బెల్టులు ధరించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు తప్పవని హెచ్చరించారు.

మునుసూరులో గుర్తుతెలియని మృతదేహం

కావలి: పట్టణంలోని మునుసూరు ప్రాంతంలో పొలాలకు, రైల్వే ట్రాక్‌కు మధ్య 30 నుంచి 40 సంవత్సరాల వయసున్న గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని ఆదివారం గుర్తించారు. ఈ విషయాన్ని వీఆర్వో తెలియజేసినట్లు కావలి రూరల్ పోలీస్‌స్టేషన్ సీఐ జి.రాజేశ్వరరావు చెప్పారు. నాలుగు రోజుల క్రితం చనిపోయి ఉండొచ్చని భావిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	: 130
లేయర్ (లైవ్)	: 110
బ్రాయిలర్ చికెన్	: 234
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 260
లేయర్ చికెన్	: 187

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి	: రూ.50
సన్నవి	: రూ.35
పండ్లు	: రూ.20

మమ అనిపించారు!

పేలవంగా రాష్ట్రస్థాయి యోగా పోటీల ముగింపు

- చివరిరోజూ ముఖం చాటేసిన అతిథులు
- పోటీలు తిలకించేందుకు క్రీడాకారులు, విద్యార్థుల కరువు
- జాతీయ జట్టుకు బాలబాలికల ఎంపికలు



యోగా విన్యాసాలు

నెల్లూరు(టౌన్): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ - 14, 17 విభాగాల్లో నెల్లూరులోని దర్గామిట్టలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ప్రారంభమైన 68వ రాష్ట్రస్థాయి యోగా చాంపియన్‌షిప్ -2024 పోటీలు ఆదివారంతో పేలవంగా ముగిశాయి. ఈ ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపీలు ముఖం చాటేశారు. జిల్లాలో అందుబాటులోనే ఉన్నా అటు వైపు రాలేదు. ఈ నేపథ్యంలో ఫెడరేషన్ సెక్రటరీ, ఆర్గనైజింగ్ సెక్రటరీలు ముఖ్యఅతిథులుగా మారి జాతీయ స్థాయికి ఎంపికైన బాలబాలికలకు మెడల్స్, సర్టిఫికెట్లను అందజేశారు. కాగా పోటీలను తిలకించేందుకు సైతం క్రీడాకారులు, విద్యార్థులు కరువయ్యారు. ఫెడరేషన్, విద్యాశాఖ ప్రచారం కల్పించకపోవడంతోనే ఈ పరిస్థితి వచ్చిందనే విమర్శలున్నాయి. జాతీయ జట్టుకు ఎంపికైనా కొందరు మెడల్స్ తీసుకోకుండానే ఇంటిబాట పట్టినట్లు చెబుతున్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐపీ ఎస్‌కే మహబూబ్‌బాషా, జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ విజయ, టోర్నమెంట్ ఆర్గనైజర్ థామస్ పీటర్, హెచ్‌ఎం కృష్ణారెడ్డి, టోర్నమెంట్ అబ్జర్వర్ పూర్ణచంద్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాతీయ జట్టుకు..

పోటీలను ట్రెడిషనల్, రిథమిక్, ఆర్టిస్టిక్ విభాగాల్లో నిర్వహించారు. వీటిల్లో పాయింట్లను ప్రామాణికంగా తీసుకుని బాలబాలికలను జాతీయ జట్టుకు ఎంపిక చేశారు. ఆర్టిస్టిక్, రిథమిక్ నుంచి ఒక్కొక్కరిని, ట్రెడిషనల్ నుంచి ఐదుగురిని ఎంపిక చేశామని నిర్వాహకులు తెలిపారు.

విజేతల వివరాలు

అండర్ – 14 బాలుర విభాగంలో..

ఆర్టిస్టిక్‌లో ప్రథమ స్థానం : సాధన్ (నెల్లూరు)

రిథమిక్‌లో ప్రథమ స్థానం : సంతోష్ (నెల్లూరు)

ట్రెడిషనల్‌లో 1.ఎస్.సాధన్ (నెల్లూరు), 2.కె.సంతోష్ (గుంటూరు), 3.ఎం.సంజయ్‌కుమార్ (తూర్పుగోదావరి), 4.ఎన్.చరణ్‌దిలీప్ (కృష్ణా), 5.కె.వెంకట్ (కృష్ణా).

బాలికల విభాగంలో..

రిథమిక్‌లో ప్రథమ స్థానం వి.సాత్విక (తూర్పుగోదావరి)

ఆర్టిస్టిక్‌లో ప్రథమ స్థానం : లహరిదుర్గా (తూర్పుగోదావరి)

ట్రెడిషనల్ విభాగంలో 1.ఎస్.అప్సనా (కర్నూల్), 2.డి.హర్షిత (విశాఖపట్నం), 3.కౌషిక (కృష్ణా), 4.దివ్యాంజలి (తూర్పుగోదావరి), 5.యూన్సీలక్ష్మి (విశాఖపట్నం).

అండర్ – 17 బాలుర విభాగంలో..

రిథమక్‌లో ప్రథమ స్థానం : వి.దుర్గా భరణి

ఆర్టిస్టిక్‌లో ప్రథమ స్థానం : కె.రామచంద్రారెడ్డి (తూర్పుగోదావరి)

ట్రెడిషనల్‌లో : 1.కె.కార్తీక్ రామచంద్రారెడ్డి (తూర్పుగోదావరి), 2.ఎం.అశోక్‌కుమార్ (అనంతపురం), 3.ఎ.మనోహర్ (కృష్ణా), 4.ఎస్‌కే అజీజ్ (తూర్పుగోదావరి) 5.సి.జ్యోతిమహేంద్ర (అనంతపురం).

బాలికల విభాగంలో..

రిథమిక్‌లో ప్రథమ స్థానం : కేవీ వైష్ణవి (విశాఖపట్నం)

ఆర్టిస్టిక్‌లో ప్రథమ స్థానం : ఎంజీ పావని (పశ్చిమగోదావరి)

ట్రెడిషనల్‌లో : 1.ఐ.ఆశ్రిత (పశ్చిమగోదావరి), 2.పి.భార్గవి (గుంటూరు), 3.తస్లీమ్ (పశ్చిమగోదావరి), 4.వి.శ్రీముఖి (విశాఖపట్నం), 5.హేమ ధనశ్రీ (తూర్పుగోదావరి).



జాతీయ స్థాయికి ఎంపికైన బాలబాలికలు



వెలవెలబోతున్న క్రీడా పోటీల ప్రాంగణం

కప్ సాధిస్తాం



రాష్ట్రస్థాయి అండర్ - 14 విభాగంలో ఆర్టిస్టిక్, ట్రెడిషనల్ విభాగాల్లో ప్రథమ స్థానాన్ని సాధించడం చాలా ఆనందంగా ఉంది. జాతీయ జట్టుకు ఎంపికై నందుకు పీఈటీ, హెడ్‌మాస్టర్‌కు రుణపడి ఉంటాను. – సాధన్

చాలా ఆనందంగా ఉంది



జాతీయ జట్టుకు ఎంపిక కావడం చాలా ఆనందంగా ఉంది. ఆర్టిస్టిక్ అండర్ – 14 విభాగంలో రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం సాధించి గోల్డ్ మెడల్ అందుకున్నాను. మా పీఈటీ, హెడ్‌మాస్టర్ కృషి వల్లే ఈ స్థాయికి చేరుకున్నాను. – వి.సాత్విక

టెన్షన్ పడ్డాను



రాష్ట్రస్థాయిలో ప్రదర్శన అంటే చాలా టెన్షన్ పడ్డాను. మా పీఈటీ ధైర్యం చెప్పారు. అండర్ – 14 జాతీయ జట్టుకు ఎంపిక కావడం చాలా ఆనందంగా ఉంది. అక్కడ కూడా రాణించి మెడల్ సాధించేందుకు కృషి చేస్తా. – లహరిదుర్గ

జాతీయ పోటీల్లో రాణిస్తా



అండర్ – 17 బాలుర విభాగంలో ఆర్టిస్టిక్‌లో గోల్డ్‌మెడల్ అందుకోవడం చాలా ఆనందంగా ఉంది. జాతీయ జట్టుకు ఎంపికవడం గర్వంగా పీలవుతున్నా. అక్కడ కూడా రాణిస్తా. – కె.రామచంద్రారెడ్డి

గోల్డ్‌మెడల్ సాధించా



అండర్ – 14 బాలుర విభాగంలో రిథమిక్‌లో ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్‌మెడల్ అందుకోవడం చాలా ఆనందంగా ఉంది. – డి.సంతోష్

మంత్రి అనుచరుడిని.. నా ఇష్టం

- పెన్నానదిలో ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు
- జేసీబీల వినియోగం
- మంత్రి నారాయణ అనుచరుడి నిర్వాకం
- సోషల్ మీడియాలో వీడియో వైరల్



ఇసుక తవ్వకాలు చేయిస్తున్న మంత్రి నారాయణ ముఖ్య అనుచరుడు లెక్కల వెంకారెడ్డి

సాక్షి, టాస్క్‌ఫోర్స్: ఇసుక విషయంలో అంతా సవ్యంగా ఉందని మంత్రులు, ఎమ్మెల్యేలు పైకి చెబుతున్నారు. కానీ క్షేత్రస్థాయిలో తెలుగు తమ్ముళ్లు రెచ్చిపోతున్నారు. పేద, మధ్య తరగతి ప్రజలకు సంబంధించి ఇళ్ల నిర్మాణాలకు ఉచితంగా ఇసుక అందిస్తున్నట్లు ఇటీవల సీఎం చంద్రబాబు ఆర్భాటంగా ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే ఇది ఎక్కడా అమలు కావడం లేదు. టీడీపీ నేతలే ఇసుక మాఫియాను నడిపిస్తున్నారు. నిబంధనలు సామాన్యులకేనని, తమకు పట్టవని చెబుతున్నారు.

చేస్తోంది ఆయన అనుచరుడే..

నెల్లూరు నగరంలోని దీన్‌దయాళ్ నగర్‌కు సమీపంలో పెన్నానదిలో రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ ఇటీవల ఇసుక రీచ్‌ను ప్రారంభించిన విషయం తెలిసిందే. ఆ సమయంలో ఆయన మాట్లాడుతూ ఇసుక తవ్వకాలకు యంత్రాలు వినియోగిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లలో స్థానిక ప్రజలు మాత్రమే తీసుకెళ్లాలన్నారు. ఆ రీచ్‌లోనే సాక్షాత్తు మంత్రి అనుచరుడైన టీడీపీ నేత లెక్కల వెంకారెడ్డి రెండు జేసీబీలను పెట్టి ఇసుకను తవ్వించి ట్రాక్టర్లలో లోడ్ చేయిస్తున్నారు. కాగా ఇదే రీచ్ నుంచి పలువురు నేతలు టిప్పర్లలో ఇతర ప్రాంతాలకు ఇసుక తరలించి అధిక ధరలకు విక్రయిస్తున్నారని సమాచారం. నేతల తీరుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బుకాయింపు

వెంకారెడ్డి దగ్గరుంచి జేసీబీలతో ఇసుక తవ్వకాలు చేయిస్తుండగా ఓ వ్యక్తి వెళ్లి వీడియో తీశాడు. నారాయణ చెప్పారా? లేదా కలెక్టర్ చెప్పారా? అని ప్రశ్నించాడు. దీనికి వెంకారెడ్డి స్పందిస్తూ రోడ్డు చదును చేసేందుకు మాత్రమే జేసీబీలను తీసుకొచ్చానని కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేశాడు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో ఆదివారం వైరల్‌గా మారింది.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలు ప్రారంభం



బాలికలను పరిచయం చేసుకుంటున్న జెడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ



మ్యాచ్‌లో తలపడుతున్న క్రీడాకారులు

నెల్లూరు సిటీ: 68వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్ – 17 బాలబాలికల హాకీ చాంపియన్‌షిప్ పోటీలు నెల్లూరు రూరల్ మండలంలోని సౌత్‌మోపూరులో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో ఆదివారం మొదలయ్యాయి. జిల్లా పరిషత్ జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ ముఖ్యఅతిథిగా విచ్చేసి క్రీడా జ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సౌత్‌మోపూరులో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. గెలుపోటములతో సంబంధం లేకుండా పోటీల్లో పాల్గొనాలని విద్యార్థులకు సూచించారు. జెడ్పీ నిధుల ద్వారా పాఠశాలలో ప్రహరీని పూర్తి చేస్తానని తెలియజేశారు. డీఈఓ బాలాజీరావు మాట్లాడుతూ పోటీలు 5వ తేదీ వరకు జరుగుతాయన్నారు. అన్ని జిల్లాల నుంచి సుమారు 600 క్రీడాకారులు, 100 మంది కోచ్‌లు, మేనేజర్లు, 50 మంది అంపైర్లు పాల్గొంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో పీఎంఎస్ఎస్ఏ ఉషారాణి, ప్రజాప్రతినిధులు, అధికారులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

తొలిరోజు మూడు మ్యాచ్‌లు

బాలుర విభాగం మొదటి మ్యాచ్ శ్రీకాకుళం, తూర్పుగోదావరి జిల్లా జట్ల మధ్య జరిగింది. ఇందులో తూర్పుగోదావరి జట్టు విజయం సాధించింది. ప్రకాశం, కర్నూలు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ప్రకాశం జట్టు గెలిచింది. బాలికల విభాగంలో నెల్లూరు, వెస్ట్ గోదావరి జిల్లాల మధ్య పోటీ జరగ్గా వెస్ట్ గోదావరి జట్టు విజయం సాధించింది. వర్షం కారణంగా మూడు మ్యాచ్‌లకు ఆటంకం కలిగింది. మరోరోజు వాటిని నిర్వహించనున్నారు.

పందిరి సాగు.. లాభాలు మెండు

తీగజాతి కూరగాయలపై రైతుల ఆసక్తి

- నాణ్యమైన దిగుబడులు సాధిస్తున్న వైనం
- అత్యధికంగా కలిగిరి మండలంలోనే సాగు



సొరకాయల సాగు

కలిగిరి: జిల్లాలో రైతులు ఉద్యాన పంటలపై మక్కువ పెంచుకుంటున్నారు. స్వల్పకాలిక పంటలను పండించి మంచి లాభాలు సాధిస్తున్నారు. తీగజాతికి చెందిన దొండ, బీర, కాకర, సొర, పొట్ల కాయలను అధికంగా పండిస్తున్నారు. ఈ కూరగాయలు తినడం వల్ల ఆరోగ్యపరంగా ఎన్నో ప్రయోజనాలు ఉండడంతో ప్రజలు అధికంగా కొనుగోలు చేస్తున్నారు. ఉద్యాన శాఖ అధికారులు రైతులకు శాశ్వత పందిళ్ల ద్వారా కూరగాయల సాగుపై అవగాహన కల్పిస్తున్నారు. ఈ పద్ధతిలో సాధారణంగా నేలపైన పండించే విధానం కంటే 30 నుంచి 40 శాతం దిగుబడి అధికంగా ఉంటుంది.

జిల్లాలో ఇలా..

కలిగిరిలో 90 ఎకరాలు, పొదలకూరులో 63, వలేటివారిపాలెంలో 25, వరికుంటపాడులో 23, మనుబోలులో 15, చేజర్లలో 14, ఏఎస్‌పేటలో 11 తదితర మండలాల్లో కలిపి 292.21 ఎకరాల్లో సాగు శాశ్వత పందిళ్ల సాగు ఉందని అధికారులు చెబుతున్నారు.

ఇలా చేస్తే..

పంటలు వేసే ముందు రైతులు జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలి. గుర్తింపు ఉన్న కంపెనీల విత్తనాలను మాత్రమే కొనుగోలు చేసి నాటాలి. ఉద్యాన శాఖ అధికారుల సూచన మేరకు క్రమం తప్పకుండా నిర్ణీత సమయంలో తగిన మోతాదులో మందులను పిచికారీ చేయడం ద్వారా నాణ్యమైన కాయలు వచ్చి మార్కెట్‌లో ధరలు వచ్చేందుకు ఆస్కారం ఉంటుంది. ప్రస్తుతం ఒక ఎకరాకు పందిరి వేయాలంటే సుమారు రూ.3 లక్షల వరకు ఖర్చవుతోంది. ఒకసారి పందిరి వేస్తే 20 ఏళ్ల వరకు ఉంటుంది. హైక్వాలిటీ మెటీరియల్ వాడితే మరో ఐదేళ్లు ఎక్కువ కాలం వస్తాయి. ఎకరాకు ప్రభుత్వం నుంచి రూ.లక్ష రాయితీ వస్తుంది. ఎస్సీ రైతులకు ఈజీఎస్ (ఎంప్లాయ్‌మెంట్ గ్యారెంటీ స్కీమ్) ద్వారా 50 శాతం రాయితీ వస్తుంది. సొరకాయ, కాకర విత్తనాలను జనవరి, ఫిబ్రవరి నెలల్లో, బీర విత్తనాలను డిసెంబర్ నుంచి ఫిబ్రవరి మధ్య, సొర విత్తనాలను డిసెంబర్, జనవరి నెలల్లో, దొండ విత్తనాలను జూన్, జూలై నెలల్లో విత్తుకోవాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

జిల్లాలో..

శాశ్వత పందిళ్ల సాగు :	తాత్కాలిక సాగు:
292.21 ఎకరాలు	29 ఎకరాలు


దిగుబడులు బాగున్నాయి



పందిరి ద్వారా ఒకటిన్నర ఎకరాలో ఐదేళ్లుగా సాగు చేస్తున్నాను. రాయితీ రూ.1.50 లక్షలు అందింది. దిగుబడులు బాగుంటున్నాయి. సాధారణంగా సాగుకు కంటే పెట్టుబడి తక్కువగానే ఉంటుంది. ఏడాది పొడవునా సాగు చేయొచ్చు.

– సింగారెడ్డి గురవారెడ్డి, నాగిరెడ్డిపాళెం, కలిగిరి మండలం

రైతులను ప్రోత్సహిస్తున్నాం



పందిళ్ల ద్వారా కూరగాయలు సాగు చేయాలని రైతులను ఉద్యాన శాఖ ద్వారా ప్రోత్సహిస్తున్నాం. ఒకసారి పందిరి నిర్మాణం చేపడితే దీర్ఘకాలం రైతులు ప్రయోజనం పొందవచ్చు. పందిళ్ల ద్వారా పండించిన దిగుబడులకు మార్కెట్‌లో మంచి ధరలు పలుకుతున్నాయి.

– ఎంపీ సుబ్బారెడ్డి, జిల్లా ఉద్యాన శాఖాధికారి, నెల్లూరు



కాకరకాయల సాగు



దొండకాయల సాగు